కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ రజిత, ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్





సైన్స్ ఎక్స్‌పోలో విద్యార్థులు



విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్లు



సైన్స్‌డేలో పాల్గొన్న విద్యార్థులు



ఘనంగా జాతీయ సైన్స్ డే వేడుకలు

చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల పరిధిలో జాతీయ సైన్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి చేస్తున్న పరిశోధనా ఫలితాలను వివరించారు. పలుచోట్ల అవగాహన ర్యాలీలు నిర్వహించగా.. సర్ సీవీ రామన్ జీవిత చరిత్రను తెలుసుకుని ఆయన జీవితం ఆధారంగా ప్రతి విద్యార్థి రామన్ చూపిన బాటలో నడవాలన్నారు. సైన్స్‌కు ఆధారాలు కావాలని, నమ్మకంతో పనిలేదని పలువురు అధ్యాపకులు పేర్కొన్నారు.

– చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం



శాంతినగర్ శ్రీ శ్లోకా ది స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన



సైన్స్ ఫెయిర్‌లో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న దేవర వంశీ తదితరులు



జియాగూడ సరస్వతి విద్యానికేతన్‌లో..



డాక్టర్ సీహెచ్. వెంకటేశ్వర్లుయాదవ్‌కు అవార్డు అందజేస్తున్న ఏసీపీ చంద్రశేఖర్

నగర పోలీస్ కమిషనర్‌కు సత్కారం



నగర పోలీసు కమిషనర్‌ను సత్కరిస్తున్న ఉర్దూ అన్సారీ

నాంపల్లి: హిందూ, ముస్లిం ఏక్తా కమిటీ ప్రతినిధులు బుధవారం నగర పోలీసు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కమిటీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ మైనార్టీ విభాగం నేత మహ్మద్ ఇస్మాయిల్ అన్సారీ అలియాస్ ఉర్దూ అన్సారీ నేతృత్వంలో పలువురు ప్రతినిధుల బృందం కలిసి పలు అంశాలపై చర్చించారు. అనంతరం నగర కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించారు. సంఘ సేవకులు మహ్మద్ బషీర్ అలీ, మినిమం వేజెస్ బోర్డు మాజీ చైర్మన్ ఠాకూర్ హృదయనాథ్ సింగ్, సుధా జైన్, ఏషియా తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: గ్యాస్ సిలిండర్ సబ్సిడీతో పాటు 200 యూనిట్ల విద్యుత్ బిల్లు మాఫీ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకే సాధ్యమైందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. రెండు హామీలను అమలు చేసిన సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల చిత్రపటాలకు గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై నమ్మకం ఉంచి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. గ్రామీణ ప్రజలతో పాటు పట్టణ ప్రజలు సైతం కాంగ్రెస్‌ను ఆదరించారన్నారు. ఎం.రఘుపాల్ రెడ్డి, చంద్రశేఖర్, పర్మానందం, శ్రీకాంత్, అబీబ్, నర్సింగ్, హేమలత, అనిత, స్వరూప, ఆయిషా తదితరులున్నారు.

హజ్ యాత్రికులకు సేవ చేయడం అదృష్టం



ఆస్పత్రి సిబ్బందిని సన్మానిస్తున్న హజ్ కమిటీ ఈఓ షేక్ లియాఖత్ హుస్సేన్

గోల్కొండ: హజ్ యాత్రికులకు సేవలు అందించడం దేవుడు ఇచ్చిన వరమని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరెంటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. ఈ ఏడాది హజ్‌యాత్రకు వెళ్లే వారికి గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించినందుకు హబీబ్ జైయినులాబీదిన్ ఆబీద్ ఆధ్వర్యంలో బుధవారం ఆస్పత్రిలో సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ మజహరుల్లా మాట్లాడుతూ.. తన వైద్య బృందం ఎంతో ఉత్సాహంతో హజ్‌యాత్రకు ఎంపికైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. వైద్య పరీక్షలకు వచ్చిన వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి వైద్య పరీక్షలు చేసి మెడికల్ సర్టిఫికెట్‌ను ఇచ్చామన్నారు. రాష్ట్ర హజ్ కమిటీ కార్యనిర్వాహణ అధికారి షేక్ లియాఖత్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఈ ఏడాది రాష్ట్రం నుంచి 7790 మంది హజ్‌యాత్రకు వెళ్తున్నారని, వీరిలో 4937 యాత్రికులు కేవలం హైదరాబాద్ నగరం నుంచే ఉన్నారన్నారు. గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో మొదటిసారిగా హజ్ యాత్రకు వెళ్లే ప్రయాణికులకు వైద్యపరీక్షలు నిర్వహించామన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ ఆస్పత్రిలో వాక్సినేషన్ కేంద్రం ఏర్పాటైతే మెహిదీపట్నం, లంగర్‌హౌజ్, టోలిచౌకీ, షేక్‌పేట్ తదితర ప్రాంతాల నుంచి హజ్‌కు వెళ్లే వారికి దూర భారం తగ్గుతుందన్నారు. ఏరియా ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ వినాయక్‌రావు, రాష్ట్ర హజ్ కమిటీ ఏఈఓ ఇర్ఫాన్ షరీఫ్, యూనూస్‌ఖాన్, ఇలియాస్ అక్బర్ అలీ, గోల్కొండ ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వికాసానికి విశేష కృషి



కార్యక్రమంలో మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభు తదితరులు

అబిడ్స్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు విద్యార్థుల వికాసానికై మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల విశేషంగా కృషి చేస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభు జి.బెనకోప్ పేర్కొన్నారు. విద్యార్థుల కోసం బుధవారం అబిడ్స్‌లోని మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో టెక్స్ అకాడమీ ద్వారా ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సులను అందించడానికి అర్హత కలిగిన విద్యార్థుల కోసం ఆన్‌లైన్ ద్వారా పోటీ పరీక్షలు నిర్వహించారు. ఇంజినీరింగ్ విభాగంలో చదువుతున్న ఎం.వెంకటేష్ ఎంపికైన సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభు జి.బెనకోప్ ఆయనను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఉచిత కోర్సులు ప్లేస్‌మెంట్ అందించే డ్రైవ్‌ను విద్యార్థుల సాంకేతిక వికాసానికి దోహద పడుతాయన్నారు. కార్పొరేట్ కమ్యూనికేషన్ మేనేజర్ మోహన్‌దాస్, డాక్టర్ మస్తానమ్మ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భూక్య లక్ష్మణ్, కళాశాల అడ్మినిస్ట్రేట్ అధికారి సచ్చింద్రనాథ్, అధ్యాపకులు రజినికాంత్, పుల్లారెడ్డి, రమేష్‌బాబు, సాకేత కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవో 25ను రద్దు చేయాలని ధర్నా



నాంపల్లి: టీజీటీ (ట్రైన్డ్ గ్రాడ్యుయేట్స్ టీచర్స్) పోస్టుల భర్తీలో హిందీ గురుకుల విద్వాన్ టీచర్ అభ్యర్థులకు న్యాయం జరిగేంత వరకు టీజీటీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను నిలిపివేయాలని బాధిత అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తెలుగు వర్సిటీలో జరిగిన గురుకుల ఉపాధ్యాయ సర్టిఫికెట్ వెరిఫికేషన్ సెంటర్ వద్ద అభ్యర్థులు ఆందోళన నిర్వహించారు. వర్సిటీలో గురుకుల విద్యాలయాల ఉపాధ్యాయుల భర్తీ కోసం గత కొద్ది రోజులుగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతోంది. ఈ నోటిఫికేషన్‌లో ఎక్కడ పీజీ అని చెప్పలేదని.. తత్సమాన డిగ్రీ అని మాత్రమే పొందుపరిచినట్లు అభ్యర్థులు వివరించారు. కాగా 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓనెం–25ను సాకుగా చూపి, ప్రస్తుతం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో తమను రిజెక్ట్ చేశారని ఆరోపించారు. ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ, పీజీ కోర్సుల్లో సెకండ్ లాంగ్వేజ్ హిందీ చేసిన వాళ్లను ఎంపిక చేస్తూ.. తమను అడ్డుకోవడం చాలా బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకుని హిందీ పండిట్ ఉద్యోగాలకు భర్తీ చేయకుండా తాత్కాలికంగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జీఓ నెం. 25ను రద్దు చేసి 1:2 ప్రకారం ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు.

పాత ఆర్మీ క్వార్టర్స్ సమస్యను పరిష్కరించండి

గోల్కొండ: గోల్కొండ మహ్మదీలైన్స్‌లోని నిజాం పాత ఆర్మీ క్వార్టర్స్ సమస్యను పరిష్కరించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. బుధవారం సాయంత్రం ఆయన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా ఉన్న దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిజాం కాలం నాటి మిలట్రీ క్వార్టర్స్‌ను క్రమబద్ధీకరించేందుకు 118 జీవోను విడుదల చేశారన్నారు.

అయితే ఆ జీవో అమలు కాలేదన్నారు. నిజాం కాలం నాటి పాత మిలట్రీ క్వార్టర్స్‌లో ఆనాటి సైనికుల కుటుంబాలు నివసిస్తున్నారని ఆయన తెలిపారు. అయితే గోల్కొండ ఆర్టిలరీ సెంటర్ వారు పాత క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయనివ్వడం లేదన్నారు. ఈ క్వార్టర్స్‌లో జీవో 118కి అనుగుణంగా ఆనాటి సైనికుల కుటుంబాల వారికి ఇళ్లను కేటాయించాలని ఆయన కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ.. ఆర్టిలరీ సెంటర్ అధికారులు, బల్దియా అధికారులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి వారి సలహాలు, సూచనలు తీసుకుని మాజీ సైనికుల కుటుంబాలకు న్యాయం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. పాత మిలట్రీ క్వార్టర్స్ అసోసియేషన్ సభ్యులు సయ్యద్ షకీల్ హుస్సేన్, జీ.ఎం.ముస్తాఫాఖాన్, మహ్మద్ ఖలీముద్దీన్, సల్మాన్‌ఖాన్, సయ్యద్ అహ్మద్ అలీ తదితరులున్నారు.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన

గోల్కొండ: ప్రయాణికుల సూచనలు మెరుగైన సేవలు అందించేందుకు తమకు ఎంతో దోహదపడతాయని మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ బి.వి.కె.మూర్తి అన్నారు. బుధవారం మెహిదీపట్నంలోని ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెరుగైన సేవలు అందించేందుకు తాము నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రయాణికుల నుంచే కాకుండా కాలనీ సంక్షేమ సంఘాలు, వ్యాపార సంఘాల నుంచి సైతం స్పందన వచ్చిందన్నారు. పలు రూట్లలో బస్సుల ట్రిప్పులు పెంచడానికి సూచనలు వచ్చాయని మరికొన్ని రూట్లలో మహిళల కోసం ప్రత్యేక బస్సులు వేయాలన్న సూచనలు కూడా వచ్చాయని పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

అబిడ్స్: వ్యక్తి అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మంగళ్‌హాట్‌లో నివసించే జీవన్ (36) ఈనెల 23న ఇంటి నుంచి అదృశ్యమై తిరిగి రాలేదు. ఈ మేరకు తండ్రి జట్టప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిస్తే 7125 69180 నంబరును సంప్రదించాలన్నారు.

సోదరి మృతిని తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య

అబిడ్స్: సోదరి గుండెపోటుతో మృతి చెందడాన్ని తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఇంట్లోని పడక గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంబాగ్‌కు చెందిన కేతన్ గైక్వాడ్(32) వృత్తిరీత్యా కార్పెంటర్, నెలరోజుల క్రితం భార్య ప్రసవించడంతో కర్ణాటకలోని బాల్కీలో పుట్టింట్లోనే ఉంటుంది. అయితే సీతారాంబాగ్‌లో తల్లి రమాబాయితో కలిసి ఉంటున్నాడు. నెల రోజుల క్రితం సోదరి గౌతమీ(36) గుండెపోటుతో మరణించడంతో తట్టుకోలేక నిత్యం అతిగా మద్యం సేవించడం మొదలుపెట్టాడు. ఎప్పటి మాదిరిగానే మంగళవారం రాత్రి తొమ్మిదిన్నర గంటలకు ఇంటికి చేరుకొని మద్యం సేవించి టీవీ.చూస్తూ గదిలో ఉండగా.. అతడి తల్లి తలుపు దగ్గర వేసుకుని వరండాలో నిద్రకు ఉపక్రమించాడు. బుధవారం తెల్లవారు జామున నాలుగున్నర గంటలకు లేచి చూసేసరికి కేతన్ గైక్వాడ్ గది కిటికీ చువ్వలకు చున్నీతో ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



ప్రజాదర్బార్‌లో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజల సమస్యలు తెలుసుకోవడానికే తాను ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన టోలిచౌకీలోని కార్యాలయంలో ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నుంచి వివిధ ప్రాంతాల వారు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన దశలవారీగా సమస్యను పరిష్కరిస్తానన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో జరుగుతున్న అధునాత డ్రైనేజీ లైన్ల నిర్మాణం పూర్తైతే డ్రైనేజీ పొంగిపొర్లే సమస్యలు తలెత్తవని ఆయన పేర్కొన్నారు. డ్రైనేజీ పనులు చివరిదశలో ఉన్నాయన్నారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పైపులు, మ్యాన్‌హోల్స్ దెబ్బతిన్నాయని వాటి వివరాలను తాను సంబంధిత అధికారులకు వివరించానన్నారు. ప్రాధాన్యత క్రమంలో అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటారన్నారు. టోలిచౌకీ చౌరస్తా, ఎండీలైన్స్, తూమ్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో వరద నీటి పైపులైన్ పనులు కొనసాగుతున్నాయని ఫిర్యాదులు వచ్చాయన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నానల్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, సయ్యద్ జబ్బార్, హబీబ్‌చౌస్, బేగ్ తదితరులున్నారు.



ఆకట్టుకున్న నృత్య రూపకం

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాటకరంగ సంస్థ రసరంజని ఆధ్వర్యంలో బుధవారం రవీంద్ర భారతిలో భక్త పోతన నాటకాన్ని ప్రదర్శించారు. చింతలపాటి సోమరాజు సాంస్కృతిక సేవా సంస్థచే ప్రదర్శించిన నాటకం ఆహుతులను ఆకట్టుకుంది. 15వ శతాబ్దంలో జరిగినటువంటి సంఘటనలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. రసరంజని కార్యవర్గసభ్యులు, నాటక ప్రియులు పాల్గొన్నారు.

బీజేపీకి మద్దతుగా ఎమ్మార్పీఎస్ భారీ ప్రదర్శన



బీజేపీకి మద్దతుగా నినాదాలు చేస్తున్న దృశ్యం

అబిడ్స్: ఫిర్ ఏక్ బార్ మోదీకా సర్కార్ అంటూ.. ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు భారీ ప్రదర్శన చేశారు. పాతబస్తీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నిర్వహించిన విజయ సంకల్ప యాత్రకు గోషామహల్ నుంచి ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు పూజలోల్ల రవిమాదిగ ఆధ్వర్యంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దఎత్తున ప్రదర్శనలు నిర్వహించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు టీవీ.నర్సింహరావు మాదిగ, ఉపాధ్యక్షులు పూజలోల్ల రవి మాదిగలు మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణకు మాదిగ రిజర్వేషన్ పోరాటం కోసం తాము చేపడుతున్న ఉద్యమాలకు ప్రధాని నరేంద్రమోదీ తమకు మద్దతు తెలిపి తమ చిరకాల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేశారన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలంతా అసెంబ్లీ తరహాలో పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు అన్ని ప్రాంతాల్లో బీజేపీని గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. రాజు మాదిగ, అరుణ్ మాదిగ, ములుగు శివమాదిగ, విజయ్ మాదిగ, నరేందర్ మాదిగ, వెంకటేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ఎంపీ స్థానాన్ని గెలుస్తాం

బీజేపీ రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

చాంద్రాయణగుట్ట/గౌలిపురా: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈసారి బీజేపీ జెండా ఎగురవేస్తామని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌లు అన్నారు. బీజేపీ నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్ర 9వ రోజు బుధవారం పాతబస్తీకి చేరుకుంది. శాలిబండ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర అలియాబాద్, శంషీర్‌గంజ్, రాజన్నబావి, ఫూల్‌బాగ్ చమన్, లాల్‌దర్వాజా మహంకాళి దేవాలయం, లాల్‌దర్వాజా మోడ్, నాగులచింత, గౌలిపురా మీదుగా ఛత్రినాక చౌరస్తాకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయ సంకల్ప యాత్రలో భాగంగా ప్రధాని మోదీకి మద్దతు కూడగడుతున్నామన్నారు. ఉచితాల పేరుతో కాంగ్రెస్ పార్టీని పేదలను మోసం చేస్తుందని విమర్శించారు. ఆరు గ్యారంటీల పథకాల్లో కాంగ్రెస్ ఎన్నో కొర్రీలు పెడుతున్నారన్నారు. నరేంద్ర మోదీ కుల, మతాలకతీతంగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఎంఐఎం కారణంగానే పాతబస్తీకి మెట్రోరైలు రాలేదని, పేద ముస్లింలు బాగుపడితే తమ పప్పులు ఉడకవని మజ్లిస్ అభివృద్ధికి మోకాలడ్డుతుందన్నారు. మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు. అన్ని పార్టీలు కుటుంబాల కోసం పని చేస్తుంటే.. బీజేపీ మాత్రం దేశం కోసం పని చేస్తుందన్నారు. పేదల కోసం మోడీ సర్కార్ ఎన్నో సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక పరిస్థితిని... 5వ స్థానానికి తీసుకొచ్చిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. అనంతరం ఉప్పుగూడ, అరుంధతి కాలనీ, రక్షాపురం మీదుగా ఐ.ఎస్.సదన్‌కు బయల్దేరింది. ఆలె భాగ్యలక్ష్మి, శ్వేతారెడ్డి, సురేందర్ రెడ్డి, కొడీ మహేందర్, వీరేందర్‌బాబు యాదవ్, నరేష్, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్‌జీ, మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర, నాయకులు రూప్‌రాజ్, ఆదర్శ మహేష్, మాదరి చంద్రశేఖర్, డాక్టర్ పండరీ, తాడెం శ్రీనివాసరావు, పండరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కె.లక్ష్మణ్

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు



సంతోష్‌నగర్: ఇంటర్మీడియట్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ఐఎస్‌సదన్, సంతోష్‌నగర్ డివిజన్ పరిధిలోని మొత్తం 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. నారాయణ జూనియర్, సెక్సెస్, హిదాయత్ జూనియర్ కళాశాల, శ్రీనివాస కాలేజీ తదితర కళాశాలల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు జరిగాయి. పరీక్షలకు హాజరైన విద్యార్థులకు కేంద్రం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించిన అనంతరం లోపలికి అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద సంతోష్‌నగర్, కంచన్‌బాగ్, ఐఎస్‌సదన్ పోలీసుల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఆలస్యమవడంతో ఇద్దరు విద్యార్థులు వెనక్కి..


గన్‌ఫౌండ్రీ: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం సజావుగా ప్రారంభమయ్యాయి. గన్‌ఫౌండ్రీ పరిధిలోని మహబూబియా, ఆలియా పరీక్షా కేంద్రాల్లో పరీక్షలకు తగిన ఏర్పాట్లు చేశారు. కాగా మహబూబియా జూనియర్ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో వెనుదిరిగి వెళ్లారు. ప్రతి కళాశాల వద్ద పరీక్షా సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసులు తెలిపారు.

సిటీ కాలేజీ జాబ్‌మేళాకు విశేష స్పందన



చార్మినార్: ప్రభుత్వ సిటీ కాలేజీలో తెలంగాణ స్కిల్స్ ఫర్ నాలెడ్జ్ సెంటర్ (టీఎస్‌కేసీ) ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మెగా జాబ్‌మేళాకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్ తెలిపారు. దాదాపు 50కి పైగా కంపెనీలు పాల్గొని ఉద్యోగ అవకాశాలు కల్పించాయన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి నిరుద్యోగ యువతీయువకులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని లబ్ధిపొందారని టీఎస్‌కేసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఝాన్సీరాణి తెలిపారు.

వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడిగా నర్సింహామూర్తి



సుల్తాన్‌బజార్: విశ్వ హిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నర్సింహామూర్తి నియమితులయ్యారు. ఇటీవల అయోధ్యనగరంలో విశ్వహిందూ పరిషత్ అఖిల భారత సమావేశాల్లో ఆయనను ఎన్నుకున్నారని వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో పలువురికి బాధ్యతల్లో మార్పులు చేర్పులు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బోజనపల్లి నర్సింహామూర్తి, ఉమ్మడి రాష్ట్రాల ఆర్గనైజింగ్ సెక్రటరీగా సత్యంజీ, భజరంగ్‌దళ్ భాగ్యనగర్ క్షేత్ర సంయోజక్‌గా కుమారస్వామిలు ఎన్నికైనట్లు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణకు 'రౌండ్ ది క్లాక్'



ముఫ్తీ కలీల్ అహ్మద్‌ను సన్మానిస్తున్న చార్మినార్ ఏసీపీ సుదర్శన్

చార్మినార్: శాంతి భద్రతల పరిరక్షణకు 'రౌండ్ ది క్లాక్' సేవలను అందజేస్తున్నామని.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా తమ సిబ్బంది ఎప్పటికప్పుడు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటారని చార్మినార్ నూతన ఏసీపీ సుదర్శన్ అన్నారు. బుధవారం హుస్సేనీఆలం ఇన్‌స్పెక్టర్ సురేందర్‌తో కలిసి పాతబస్తీలోని జామే నిజామియా ఉర్దూ యూనివర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఏసీపీ సుదర్శన్ మాట్లాడుతూ.. లా అండ్ ఆర్డర్ కాపాడటం కోసం అన్ని వర్గాల ప్రజల సహాయ సహకారాలు ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ముఫ్తీ కలీల్ అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో ఘనంగా సత్కరించారు. కలీల్ అహ్మద్ కూడా ఏసీపీకి స్వాగతం పలికి సన్మానించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684